

గవర్నర్‌తో మాకూ సమస్యలున్నాయ్

● పుదుచ్చేరి ప్రచారంలో సీఎం స్టాలిన్

పుదుచ్చేరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ వల్ల ఒక్క పాండిచ్చేరికి మాత్రమే కాదని, తమకు కూడా సమస్యలున్నాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం పుదుచ్చేరి నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగానికిక మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, పుదుచ్చేరిలో డీఎంకే - కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. కానీ బీజేపీ - ఎన్‌ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి తారుమారైందన్నారు. వైద్యలింగం పుదుచ్చేరి స్పీకర్‌గా ఉన్న సమయంలో ఈ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌తో తలపడ్డారని గుర్తు చేశారు. బీజేపీ నేతలను రాష్ట్రాల గవర్నర్లుగా నియమించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా గవర్నర్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి గవర్నర్లతో పుదుచ్చేరి వాసులకు మాత్రమే కాకుండా, తమకు కూడా సమస్యగా ఉందని ఆయన పేర్కొన్నారు. అకారణంగా రేషన్ బియ్యం సరఫరాను నిలిపివేస్తున్నార న్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై ముఖ్యమంత్రిగా ఉన్న నారాయణ స్వామికి ఏమాత్రం సహకరించకుండా, ఇష్టారాజ్యంగా వ్యవహరించి, భారత రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలను గాలికొదిలేసి అధికార దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తి బీజేపీకి చెందిన మహిళా గవర్నర్ కిరణ్‌బేడీ అని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.రంగస్వామికి తీవ్రమైన ఒత్తిడి ఉందన్నారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ పాలకులకు రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్టించుకోరన్నారు. వారికి కావాల్సింది కేవలం అధికారం మాత్రమేనని వ్యాఖ్యానించారు. తమిళనాడు తరహాలో ఒక రాష్ట్రం ఉంటే దాన్ని మున్సిపాలిటీగా మార్చాలని, పుదుచ్చేరి తరహాలో ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఉంటే దాన్ని ఒక గ్రామంగా మార్చివేసి, ప్రతి ఒక్కరూ డిల్లీకి సలాం చేయాలన్నదే బీజేపీ నేతల ఆలోచన అని అన్నారు. ప్రస్తుతం పుదుచ్చేరిలో కూటమి ప్రభుత్వం ఉన్నప్పటికీ పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇవ్వకుండా బీజేపీ తన గుప్పెట్లో పెట్టుకుని వుందన్నారు. కేవలం రాష్ట్రాల హక్కులను మాత్రమే కాకుండా, కేంద్ర పాలిత ప్రాంతాల హక్కులను కూడా పరిరక్షించాలన్నదే ఇండియా కూటమి లక్ష్యమన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి తరపున ఇచ్చిన అన్ని గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. పదేళ్ల ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో రాష్ట్రాలే కాదు దేశం కూడా అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారు తీవ్రంగా నష్టపోయారని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు.



సభకు తరలివచ్చిన కార్యకర్తలు



ప్రజలకు సీఎం అభివాదం

రాష్ట్రంలో సంస్కృతి, సంప్రదాయాలు నాశనం

● తమిళం అంటే ప్రధాని మోదీకి ఎనలేని అభిమానం

● బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



కొల్లాపురం బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న నడ్డా

పెరంబూర్, ఏప్రిల్ 7: తమిళ సంస్కృతి, సంప్రదాయలను డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు నాశనం చేస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రాధిక శరత్‌కుమార్, చిదంబరం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి పి.కార్తికేయకు మద్దతుగా ఆదివారం ఉదయం జరిగిన బహిరంగ సభల్లో జేపీ నడ్డా ప్రసంగించారు. తమిళ సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపు తెచ్చేలా బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా దేశీయ ఉత్పత్తులు పెరిగాయన్నారు. 90 శాతం సెల్‌ఫోన్లు ప్రస్తుతం భారత్‌లోనే ఉత్పత్తి చేస్తున్నారన్నారు. అమెరికా, జపాన్ తదితర దేశాల్లో ఆటోమొబైల్ ఉత్పత్తులు తగ్గినా, ప్రపంచస్థాయిలో భారత ఆటోమొబైల్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందని తెలిపారు. కరోనా కారణంగా దిగజారిన దేశ ఆర్థికాభివృద్ధి 13వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరిందన్నారు. తక్కువ ధరలకు మందులు ఉత్పత్తి చేసే దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. మహిళలకు అధికారం, యువతకు ఉపాధి, ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధి, రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడం తదితర ఐదు అంశాలకు ప్రధాని మోదీ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది రైతులకు ప్రోత్సాహక నిధి, 40 లక్షల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు, 14 లక్షల గృహాలు నిర్మించామని తెలిపారు. జాతీయ రహదారుల పథకానికి అధికంగా నిధులు అందజేస్తున్నామన్నారు. కోయంబత్తూర్, హోసూరు, సేలం, తిరుచ్చి, చెన్నై తదితర ప్రాంతాల్లో రూ.1.2 వేల కోట్ల మేర డిఫెన్స్ లాజిస్టిక్ ఉత్పత్తులు చేపట్టామన్నారు. ఇండియా కూటమిలో ఉన్న అన్ని పార్టీలు కుటుంబ రాజకీయాల కోసం పాకులాడుతున్నాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకేకు కట్ట పంచాయతీలు చేయడమే ప్రధాన అజెండా అని ఆరోపించారు. రాష్ట్ర ఇన్‌ఛార్జీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అరవింద్ మేనన్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. కాగా, తిరుచ్చిలో జేపీ నడ్డా రోడ్‌షోకు పోలీసులు నిరాకరించిన నేపథ్యంలో, ఆ పార్టీ నేతలు దాఖలు చేసిన పిటిషన్ విచారించిన హైకోర్టు మదురై శాఖ, మరో ప్రత్యామ్నాయ మార్గంలో ర్యాలీకి అనుమతులు జారీ చేసింది.

మూడో రోజు కొనసాగిన ఐటీ దాడులు



పెరంబూర్, ఏప్రిల్ 7: రాష్ట్ర వ్యాప్తంగా ఆదాయపు పన్ను శాఖ అధికారులు చేపట్టిన తనిఖీలు మూడో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఈనెల 19న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేలా నగదు, బహుమతుల పంపిణీని అడ్డుకొనేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వాహన తనిఖీలు చేపట్టి పలు కోట్ల నగదు, బహుమతులు, మద్యం స్వాధీనం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఓటర్లకు పంచేందుకు నగదు సిద్ధం చేశారనే సమాచారంతో ఐటీ అధికారులు ఈనెల 5వ తేది చెన్నై, తిరునల్వేలి, తేని, తిరుపత్తూర్ తదితర ప్రాంతాల్లోని 44 చోట్ల సోదాలు చేపట్టారు. నగరంలోని రెండు ప్రాంతాలు సహా మరికొన్ని చోట్ల మూడో రోజు కూడా తనిఖీలు కొనసాగాయి. అడయార్ ఇందిరా నగర్ 25వ క్రాస్ వీధిలో ఉన్న ప్రభుత్వ కాంట్రాక్టర్ రామచంద్రన్, అభిరామపురం 9వ వీధిలో ఉన్న మెట్రోవాటర్ బోర్డు మాజీ ప్రధాన ఇంజనీర్ తంగవేలు తదితరుల ఇళ్లలో ఆదివారం తనిఖీలు కొనసాగాయి. రామచంద్రన్ పదేళ్లుగా పార్క్, వీధి దీపాల పర్యవేక్షక కాంట్రాక్ట్ చేపడుతున్నారు. అలాగే, మాజీ ప్రధాన ఇంజనీర్ తంగవేలు ప్రస్తుతం ప్రముఖ రాజకీయ నాయకుడికి సహాయకుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు నగదు పంచేందుకు రాజకీయ పార్టీలు సిద్ధపడున్నాయి అన్న సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ఐటీ అధికారులు తనిఖీలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

నయినార్ నాగేంద్రన్ బంధువు ఇంట్లో రూ.3.72 లక్షల స్వాధీనం

వేళచ్చేరి : తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ బంధువు గుణశేఖరన్ ఇంట్లో లెక్కల్లో చూపని రూ.3.72 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వాషర్‌మెన్‌పేటలో ఉన్న లక్ష్మి గాయత్రి హోటల్ యజమాని గుణశేఖర్ ఇంట్లో ఫ్లయింగ్ స్క్వాడ్, ఆదాయపు పన్ను శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి నగదు స్వాధీనం చేసుకున్నారు.

రూ.4 కోట్ల నగదు తిరిగి ఇచ్చేస్తారు: సెల్వపెరుందగై

అడయార్: తాంబరం రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న రూ.4 కోట్లను తిరిగి సంబంధిత వ్యక్తులకు ఇచ్చేస్తారని, ఈ డబ్బుతో సంబంధం ఉన్న వారిపై ఎలాంటి కేసు నమోదు చేయరని టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై అన్నారు. తిరునెల్వేలిలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటల్ నుంచి రూ.4 కోట్లను చెన్నై నుంచి తిరునెల్వేలికి తరలించేందుకు సన్నాహాలు చేశారన్నారు. అయితే, ఈ డబ్బును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్నప్పటికీ ఆ డబ్బును తిరిగి ఇచ్చేస్తారని, వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయరన్నారు. అదే బీజేపీ రాజకీయమన్నారు. కేవలం అణగారిన వర్గాలు, పేద ప్రజలపైనే బీజేపీ కేసులు నమోదు చేయిస్తుందన్నారు. నెల్లైకు వచ్చే తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హెలికాప్టర్ దిగేందుకు వీలుగా జాన్స్ స్కూల్ మైదానంలో హెలీప్యాడ్‌ను నిర్మించామన్నారు. అక్కడ నుంచి ఆయన కారులో బెల్ స్కూల్ గ్రౌండ్‌కు చేరుకుంటారని, ఈ సందర్భంగా ఆయన రోడ్ షోకు అవకాశం ఉందన్నారు.

ఎన్నికల హామీలకు డీఎంకే తిలోదకాలు

● ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆలోచించండి

● ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి



చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేయడంలో అధికార డీఎంకే విఫలమైందని, ఈ విషయాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు గుర్తెరిగి, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన ఎక్స్‌లో ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా తిరుచ్చిలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ... తమ సమస్యల సాధన కోసం ప్రభుత్వ వైద్యులు, నర్సులు, ఉపాధ్యాయులు, రవాణా శాఖ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలను డీఎంకే ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచి వేసిందన్నారు. ఆందోళనలకు పాల్పడిన సంఘ నేతలను బదిలీ చేయడంతో పాటు అరెస్ట్ చేశారన్నారు. పాత పింఛన్ విధానం అమలుకు ఎలాంటి చర్యలు చేపట్టని డీఎంకే ప్రభుత్వం, డీఏ పెంపును కూడా ఆరు నెలల జాప్యంతో ప్రకటిస్తోందన్నారు. అన్నాడీఎంకే హయాంలో కేంద్ర ఉద్యోగులు వేతనం పెంచిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పెంచామన్నారు. డీఏను ఎలాంటి బకాయి లేకుండా నిర్ణీత కాలంలో నగదు రూపంలో అందించామని తెలిపారు. అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అండగా నిలిచిందని అన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా తమ పార్టీ సిద్ధాంతాల్లో మార్పులు ఉండబోవని, ప్రజల సంక్షమమే అజెండాగా ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవని, అధికార డీఎంకేకు గుణపాఠం చెప్పే ఎన్నికలుగా భావించాలన్నారు. అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పళనిస్వామి విజ్ఞప్తి చేశారు.

ప్రధాని రోడ్‌షోకు పోలీసుల అనుమతి

వేళచ్చేరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 9న మంగళవారం రాష్ట్రానికి రానున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. పాల్గొననున్నారు. ప్రచారంలో భాగంగా స్థానిక టి.నగర్ పాండి బజార్‌లో ప్రధాని రోడ్ షోలో పాల్గొన్నారు. ప్రధాని రోడ్ షో ఏర్పాటు పనులను ఆదివారం సాయంత్రం దక్షిణ చెన్నై బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందర్‌రాజన్ పరిశీలించారు. ప్రధాని పర్యటన బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహ కలిగిస్తుందని ఈ సందర్భంగా తమిళిసై తెలిపారు. అదే సమయంలో రోడ్ షో సమయంలో దుకాణాలు మూసివేయాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సాగుతుందని ఆమె తెలిపారు.

నేడు నామక్కల్‌లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రోడ్ షో

వేళచ్చేరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):నామక్కల్‌లో సోమవారం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రోడ్ షోలో పాల్గొననున్నారు. నామక్కల్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఉదయం 9 గంటలకు కేంద్ర మంత్రి రోడ్ షో నిర్వహిం చనున్నారు. అందుకోసం ఆయన డిల్లీ నుంచి సైనిక హెలికాప్టర్‌లో సేలం కమలాపురం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో పరమత్తిలోని పీజీపీ కళాశాలకు వెళతారు. అక్కడి నుంచి కారులో నామక్కల్ చేరుకొని రోడ్‌షోలో పాల్గొననున్నారు. నామక్కల్-సేలం రహదారిలోని ఎంజీఎం థియేటర్ బస్టాండ్ సమీపంలో ప్రారంభం కానున్న రోడ్ షో సేలం రోడ్డు జంక్షన్, నేతాజీ విగ్రహం మీదుగా మణిగుండు వరకు సాగనుంది. కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మోదీకి మళ్లీ అధికారం... ప్రజాస్వామ్యానికి ప్రమాదం

● సీపీఎం జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు ప్రకాష్ కారత్



సభలో ప్రసంగిస్తున్న ప్రకాష్ కారత్

పెరంబూర్, ఏప్రిల్ 7: మోదీ మళ్లీ ప్రధాని అయితే దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సీపీఎం జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు ప్రకాష్‌కారత్ హెచ్చరించారు. మదురై సౌత్ మాసివీధిలో డీఎంకే కూటమిలో పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి వెంకటేశన్‌కు మద్దతుగా జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రకాష్ కారత్ మాట్లాడుతూ... ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు కేంద్రంలో ఎవరు అధికారం ఉండాలో నిర్ణయించే ముఖ్యమైనవి అని అన్నారు. దేశ భవిష్యత్తు, లౌకికవాదం ఈ ఎన్నికలతో ముడిపడి ఉందన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులను అరెస్ట్ చేసి జైలులో పెట్టడంతో పాటు ప్రతిపక్ష నేతలపై ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు కొనసాగుతున్నాయన్నారు. విచారణల పేరుతో వారిని వేధిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలు స్తంభింపజేయడంతో పాటు ఆదాయపు పన్ను శాఖ రూ.135 కోట్లు స్వాధీనం చేసుకుందన్నారు. మళ్లీ తాజాగా రూ.3,500 కోట్ల పన్ను బకాయిలున్నాయని నోటీసులు పంపారన్నారు. కేరళలో సీపీఎం త్రిసూర్ జిల్లా కమిటీకి చెందిన 4 బ్యాంకు ఖాతాలు స్తంభింపజేశారన్నారు. ప్రతిపక్షాలను వేటాడడం, అరెస్ట్ చేయడం, నగదు స్వాధీనం, స్తంభింపజేయడం వంటి కక్ష్య పూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. మోదీ, బీజేపీలు అయోధ్యలో రామాలయం నిర్మించడం ముఖ్యమైన సాధనగా చెబుతున్నారని, అయితే నిర్మించింది ట్రస్ట్ అన్నారు. కానీ, ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ప్రకటనలు గుప్పించారన్నారు. తమ కూటమిని అవినీతి కూటమి అంటూ మోదీ పేర్కొంటున్నారని, ఎలక్టోరల్ బ్యాండ్ల పేరుతో రూ.8,252 కోట్ల అవినీతికి పాల్పడింది బీజేపీ కాగా అన్ని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సరైన విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టును కోరామని తెలిపారు. బీజేపీ పాలనను గమనించిన తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రజలు గత లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కనివ్వలేదని, ప్రస్తుత ఎన్నికల్లోనూ అలాంటి ఫలితాలు రాబోతున్నాయని ప్రకాష్ కారత్ ధీమా వ్యక్తం చేశారు.

'స్వరాలయ' ట్రస్ట్‌కు రూ.50 లక్షల ఆర్థిక సాయం

● తెలంగాణ మంత్రి జూపల్లి

● ఘనంగా శ్రీ కళాసుధ 25వ ఉగాది పురస్కారాల ప్రదానం

● మాధవపెద్దికి 'ఎస్పీబీ' పురస్కారం

● కాసర్ల శ్యామ్‌కు 'సిరివెన్నెల' అవార్డు

● 'బాపుబొమ్మ'గా కావ్య కల్యాణ్‌రామ్





ప్రముఖ గాయని పి.సుశీలను సన్మానిస్తున్న నిర్వాహకులు

అడయార్, ఏప్రిల్ 7: ప్రముఖ సినీ నేపథ్యగాయని పి.సుశీల ఆధ్వర్యంలో సంగీత కళాకారులను ఆదుకునే నిమిత్తం స్థాపించిన 'స్వరాలయ' ట్రస్ట్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.50 లక్షల ఆర్థిక సాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నగరంలోని ప్రముఖ తెలుగు అసోసియేషన్ శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆళ్వారుపేటలోని మ్యూజిక్ అకాడమీలో 25వ ఉగాది పురస్కాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొనగా, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ గాయని పి.సుశీల, ఎస్‌బీఐ జనరల్ చెన్నై సర్కిల్ జీఎం ఎంవీఆర్ మురళీకృష్ణ, తానా ఫౌండేషన్ ఛైర్మన్ శశికాంత్ వల్లేపల్లి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు. 'విశిష్ట' ఉగాది పురస్కారాన్ని ఆదిత్యరాం గ్రూపు అధినేత ఆదిత్యరామ్‌కు, 'జీవన సాఫల్య పురస్కారం'ను రవి ప్రసాద్ యూనిట్ - హైదరాబాద్ అధినేత పి.చెంగయ్య, మాధవపెద్ది సురేష్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్య' పురస్కారం, కాసర్ల శ్యామ్‌కు 'సిరివెన్నెల సీతారామ శాస్త్రి' పురస్కారం, కుమారి శ్రేయ రామనాథ్‌కు 'లతా మంగేష్కర్' అవార్డులను ప్రదానం చేశారు. అలాగే, 2023-24 సంవత్సరానికి చిత్రపరిశ్రమకు సంబంధించి ఉత్తమనటి అవార్డును శ్రీలీల (భగవంత్ కేసరి), ఉత్తమ దర్శకుడి అవార్డును అనిల్ రావిపూడి, ఉత్తమ జ్యూరి దర్శక అవార్డును సాయి రాజేష్‌కు, ఉత్తమ జ్యూరి అవార్డును రుద్రంగి (రసమయి బాలకిషన్), చిత్రానికి, ఉత్తమ సంచలనాత్మక చిత్రంగా 'భగవంత్ కేసరి'ని ఎంపిక చేయగా, అవార్డును ఆ చిత్ర నిర్మాత సాహు గారపాటి, 'బాపుబొమ్మ' అవార్డును కావ్య కళ్యాణ్‌రామ్, 'బాపు రమణ' పురస్కారాన్ని పి.మహేష్ బాబు, 'మహిళారత్న' పురస్కారాన్ని వీజీఎన్ హోమ్స్ డైరెక్టర్, క్రెడాయ్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు పద్మ దేవదాస్‌కు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి పి.మోహన్ కుమార్ గాంధీ, జె.శర్వాణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఇందులో హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ... తన తొలి డెబ్యూ అవార్డును ఇదే వేదికనుంచి అందుకున్నానని, ఇపుడు రెండో అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ... తనకు బాగా నచ్చిన చిత్రం 'భగవంత్ కేసరి' అన్నారు. ఇలాంటి చిత్రాన్ని తీయడానికి కారణం హీరో నందమూరి బాలకృష్ణ, నిర్మాత సాహులేనని చెప్పారు. ఒక అమ్మాయిని ఎలివేట్ చేసే కథలో నటించేందుకు అంగీకరించిన హీరో బాలయ్యకు ధన్యవాదాలన్నారు. నటి కావ్య కల్యాణ్ రామ్ మాట్లాడుతూ... ప్రఖ్యాత గాయని సుశీలతో కలిసి వేదికను పంచుకుని, ఆమె చేతుల మీదుగా అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉత్తమ నిర్మాత అవార్డును అందుకున్న రవి శంకర్ మాట్లాడుతూ.. శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ తమకు ఇంటి సంస్థ వంటిదన్నారు. నాలుగోసారి అవార్డు అందుకున్నట్టు తెలిపారు.

సమాచార దర్శిని

ఆర్కే రోడ్డులో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: స్థానిక రాయపేట ఆర్కే రోడ్డు 1వ పాయింట్ బ్రిడ్జి కొంత భాగం కూల్చివే య నుండడంతో సోమవారం నుంచి 14వ తేది వరకు ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని చెన్నై ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

● అన్నా ఫ్లై ఓవర్ జంక్షన్ నుంచి కామరాజర్ రోడ్డు వచ్చే వాహనాలు మ్యూజిక్ అకాడమీ జంక్షన్‌లో ఎడమవైపు తిరిగి టీటీకే రోడ్డు మీదుగా ఇండియన్ బ్యాంక్ జంక్షన్‌లో కుడివైపు తిరిగి వీపీ రామన్ రోడ్డు, అజంతా జంక్షన్, వీఎం వీధి జంక్షన్‌లో నేరుగా వెళ్లి కుడివైపు తిరిగి జడ్జి జంబులింగం వీధి మీదుగా కామరాజర్ రోడ్డు వెళ్లాలి.

● కామరాజర్ రోడ్డు నుంచి ఆర్కే రోడ్డు మీదుగా అన్నాసాలైకి వచ్చే వాహనాలు వీఎం వీధి, ఆర్కే రోడ్డు జంక్షన్ మీదుగా ఎడమవైపు తిరిగి రాయపేట హైరోడ్డులో కుడివైపు తిరిగి పీఎస్ శివస్వామి రోడ్డులో (ఎదుటి వైపు వన్‌వే) కుడివైపు తిరిగి వివేకానంద కళాశాల జంక్షన్‌లో కుడివైపు తిరిగి మళ్లీ నీలగిరీస్ జంక్షన్‌లో ఎడమవైపు తిరిగి మ్యూజిక్ అకాడమీ ఫ్లై ఓవర్ మీదుగా అన్నాసాలై చేరుకోవాలి.

● టీటీకే రోడ్డు నుంచి కామరాజర్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు మ్యూజిక్ అకాడమీ జంక్షన్ టీటీకే రోడ్డులో నేరుగా వెళ్లి ఇండియన్ బ్యాంక్ జంక్షన్‌లో కుడివైపు తిరిగి వీపీ రామన్ రోడ్డు, అజంతా జంక్షన్‌లో నేరుగా వెళ్లి జడ్జి జంబులింగం వీధి మీదుగా కామరాజర్ రోడ్డు చేరుకోవాలి.

● పీఎస్ శివస్వామి రోడ్డు నుంచి కామరాజర్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు నీలగిరీస్ జంక్షన్‌లో ఎడమవైపు తిరిగి మ్యూజిక్ అకాడమీ సర్వీస్ రోడ్డులో కుడివైపు తిరిగి టీటీకే రోడ్డులో నేరుగా వెళ్లి ఇండియన్ బ్యాంక్ జంక్షన్‌లో కుడివైపు తిరిగి వీపీ రామన్ రోడ్డు, అజంతా జంక్షన్, వీఎస్ వీధిలో నేరుగా వెళ్లి కుడివైపు తిరిగి జడ్జి జంబులింగం వీధి గుండా కామరాజర్ రోడ్డు చేరుకోవాలి.

● లజ్ జంక్షన్ ముండగకన్నియమ్మన్ కలివివారు వీధి నుంచి రాయపేట పాయింట్ 1 మీదుగా వచ్చే వాహనాలు రాయపేట హైరోడ్డు పీఎస్ శివస్వామి రోడ్డు ఎడమ వైపు తిరిగి నీలగిరీస్ జంక్షన్‌లో కుడివైపు తిరిగి మ్యూజిక్ అకాడమీ సర్వీస్ రోడ్డులో టీటీకే రోడ్డు గుండా నేరుగా వెళ్లి ఇండియన్ బ్యాంక్ జంక్షన్‌లో కుడివైపు తిరిగి వీపీ రామన్ రోడ్డు, అజంతా జంక్షన్‌లో మళ్లీ కుడివైపు తిరిగి ఆర్కే రోడ్డు, జడ్జి జంబులింగం వీధి గుండా కామరాజర్ రోడ్డు చేరుకోవాలి.

19,500 మెగావాట్లకు చేరుకున్న విద్యుత్ వినియోగం

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: రాష్ట్ర విద్యుత్ వినియోగం 19,500 మెగావాట్లకు పెరిగింది. విద్యుత్ వినియోగం ప్రతిరోజూ పగలు 15,000 మెగావాట్లు, ఇతర సమయాల్లో 16,000 మెగావాట్లుగా ఉంటోంది. 2023 ఏప్రిల్ 20న మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ వినియోగం 19,387 మెగావాట్లుగా నమోదైంది. ఈ ఏడాది మార్చి నుంచే ఎండలు విపరీతంగా కాస్తుండడంతో ఏసీ, ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్ వంటి సాధనాల వినియోగంతో మార్చి 22 ఉదయం 11 గంటలకు విద్యుత్ వినియోగం 19,409 మెగావాట్లకు చేరుకుంది. ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు 19,413 మెగావాట్లు, 4వ తేదీ ఉదయం 10.30 గంటలకే 19,455 మెగావాట్లు ఉండగా, శనివారం సాయంత్రం 4 గంటలకు 19,580 మెగావాట్లకు పెరిగిందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

రేపు క్రికెట్ క్రీడాకారుల ఎంపిక శిబిరం

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: చెంగల్పట్టు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు జరగనున్నాయి. ఔత్సాహికులు పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. 16 నుంచి 19 ఏళ్లలోపున్న వారు మంగళవారం చెంగల్పట్టు జిల్లా మాంబాక్కం కపిలన్ క్రీడా మైదానంలో ఉదయం 6 గంటలకు జరిగే ఎంపిక శిబిరంలో పాల్గొనేందుకు నెం.7338805588లో పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

24నుంచి పురాతన పెయింటింగ్‌పై వర్క్‌షాప్

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: పురాతన పెయింటింగ్‌పై ఈనెల 24 నుంచి 30వ తేది వరకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రాచీన మానవులు సహజ రంగులతో గీసిన కుడ్యచిత్రాలు ఇటీవల పరిశోధనల్లో గుర్తించారు. పల్లవులు, పాండ్యుల కాలంలో ఆలయ గోడలపై ఎక్కువగా ఇలాంటి చిత్రాలు గీసినట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. ఇలాంటి పురాతన పెయింటింగ్ గురించి పరిశోధక విద్యార్థులకు అవగాహన కల్పించేలా మదురై, కాంచీపురం, తంజావూరు ఆలయాల ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30వ తేది వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న పరిశోధక విద్యార్థులు https:// forms.gle/ KUNFPBT9లో 19వ తేదిలోగా పేరు నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

30,000 పొట్టేళ్లు దిగుమతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: రంజాన్ పండుగను పురస్కరించుకొని చెన్నైకి 30,000 పొట్టేళ్లు, మేకపోతులు దిగుమతి అయ్యాయి. ఈనెల 11వ తేది రంజాన్‌ను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా సంతల్లో గొర్రెలు, మేకల విక్రయాలు ఊపందుకున్నాయి. నగరంలో ఆదివారం వీటి విక్రయాలు ప్రారంభమయ్యాయి. మేకపోతు రూ.7,000 నుంచి రూ.7,500 వరకు విక్రయ య్యాయి. రెట్టేరి, విల్లివాక్కం, సైదాపేట, పులియాన్‌తోపు ప్రాంతాల్లో నిర్వహించిన సంతల్లో రూ.21 కోట్లకు పైగా విక్రయాలు జరిగాయని వ్యాపారులు తెలిపారు.

సీబీఎస్‌ఈ విద్యలో వేద పాఠ్యాంశాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: స్థానిక ఆవడి సమీపంలోని పరుత్తిపట్టు జైగోపాల్ గరోడియా విద్యాలయంలో సీబీఎస్‌ఈ విద్యతో పాటు వేద పాఠ్యాంశాలు నేర్పించేలా సమన్వయ పాఠశాలను ప్రారంభించారు.కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఈ పాఠశాల పనిచేస్తోంది. ఇక్కడ కొత్తగా సమన్వయ పాఠ్య ప్రణాళిక ప్రారంభించారు. ఈ ప్రణాళికలో చేరే విద్యార్థులు ఫుల్ టైం హాస్టల్‌లో బస చేసి ఉచితంగా సీబీఎస్‌ఈ పాఠశాల విద్య నేర్చుకోవచ్చు. అలాగే, సంస్కృతం, పంచాంగం, పౌరోహిత్యం సహా ఆధ్యాత్మిక శిక్షణ పొందవచ్చు. పాఠశాల పూర్తికాగానే ఉన్నత విద్య అభ్యసించేందుకు ఉపకారవేతనం అందజేస్తారు. ఇతర వివరాలకు నెం.7305971770లో సంప్రదించవచ్చు.

కాశిమేడులో భారీగా పెరిగిన చేపల ధరలు

అడయార్, ఏప్రిల్ 7: కాశిమేడు మార్కెట్‌లో చేపల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈనెల 15న చేపల వేటపై నిషేధం అమల్లోకి రానుంది. దీంతో ఆదివారం సెలవు రోజు కావడంతో మాంసాహార ప్రియులు చేపలు కొనుగోలుకు పోటీ పడ్డారు. ఈ కారణంగా ఈ మార్కెట్‌లో విక్రయించే అన్ని రకాల చేపల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ముఖ్యంగా, పెద్ద రకం, చిన్నరకం చేపలతో పాటు వంజిరం, కొడువా, రొయ్యలు, ఎండ్రకాయలు ధరలు ఆకాశాన్నంటాయి. అయినప్పటికీ నగరవాసులు వాటిని కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు.

సి-విజిల్ యాప్‌లో 1,694 ఫిర్యాదులు

కరూర్ అగ్రస్థానం ● ఆ రెండు జిల్లాల్లో ఫిర్యాదుల్లేవు



పెరంబూర్, ఏప్రిల్ 7: ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదు చేయడంలో కరూర్ జిల్లా అగ్రస్థానంలో నిలవగా, రెండు జిల్లాల నుంచి ఎలాంటి ఫిర్యాదులందలేదని ఎన్నికల కమిషన్ తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న అభ్యర్థులు కులమతాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు, ఓటర్లను మభ్యపెట్టేలా నగదు, బహుమతుల పంపిణీ, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ప్రజలు ఫిర్యాదు చేసేలా భారత ఎన్నికల కమిషన్ సి-విజిల్ యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా కరూర్ జిల్లాలో అత్యధికంగా 372 ఫిర్యాదులందాయి. అలాగే, చెన్నై జిల్లా పరిధిలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో 209, వేలూరు జిల్లాలో 116 ఫిర్యాదులందాయి. అదే సమయంలో తిరువారూర్, మైలాడుదురై తదితర జిల్లాల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. కొన్ని ఫిర్యాదులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు తెలిపారు.

'శ్రీ ఆంధ్ర కళాస్రవంతి' ఆధ్వర్యంలో రేపు ఉగాది వేడుకలు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'శ్రీ ఆంధ్ర కళాస్రవంతి' ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరగనున్నాయి. అరుంబాక్కంలోని డీజీ వైష్ణవ్ కళాశాల ద్వారకా ఆడిటోరియంలో సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకలకు ఆదిత్యా గ్రూపు సంస్థల చైర్మన్ ఆదిత్యారామ్ ముఖ్యఅతిథిగా, ఐఎస్‌పీ గ్రూప్ ప్రమోటర్, కమిటీ చైర్మన్ బద్రీనారాయణ ప్రసాద్, ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర విశిష్ట అతిథులుగా హాజరవుతారు. వేడుకల్లో భాగంగా ముందుగా విశాఖపట్నానికి చెందిన 'స్నేహాంజలి ఆర్ట్స్' ఆధ్వర్యంలో కూచిపూడి, అరకు థింసా, ఫ్యూజన్ నృత్య ప్రదర్శన, కాంతారి, శ్రీనివాస కల్యాణ నృత్యం, శివతాండవం, స్ప్రింగ్ నృత్యం, పాటల ప్రదర్శన వంటి సాంస్కృతిక ప్రదర్శనలుంటాయి. అనంతరం సుసర్ల కుటుంబ శాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ పఠనం, శ్రీ ఆంధ్ర కళాస్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు స్వాగతోపన్యాసం, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ కార్యదర్శి నివేదికను సమర్పిస్తారు. అదే విధంగా తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ ఎ.మనోహరన్‌కు ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. అంతేగాక ప్రతిభావంతులైన టెన్త్, ప్లస్‌టూ విద్యార్థులకు, ఆయా తరగతుల్లో తెలుగు సబ్జెక్టులో ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులకు తలా రూ.10 వేలను అందిస్తారు. కార్యక్రమం అనంతరం విందు ఉంటుంది. ఈ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఇద్దరికి 'రంగనాథన్' సాహితీ పురస్కారం



జ్ఞానసుందరం, బాలసుబ్రమణియన్

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: 'ముండ్రిల్' సాహిత్య సంఘం ఆధ్వర్యంలో జ్ఞానసుందరం, బాలసుబ్రమణియన్‌కు ఈ ఏడాది 'మ రంగనాథన్' సాహిత్య పురస్కారాలు అందజేయనున్నారు. తమిళ కవిత్వం, చిన్న కథలు, నవల, కళలు వంటి వాటిల్లో సూక్ష్మ పరిశీలన, ప్రతిభ, నైపుణ్యం కలిగిన రచయితలైన ఈ ఇద్దరికి ఈ పురస్కారాలు అందించనున్నారు. మైలాడుదురై జిల్లా సోలియూర్‌లో జన్మించిన జ్ఞానసుందరం వివిధ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేయడంతో పాటు తమిళ విశ్వవిద్యాలయ తాళపత్ర విభాగంలో విధులు నిర్వహించారు. సెమ్మొళి కేంద్ర సంస్థ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అలాగే, తంజావూరు జిల్లా కుంభకోణానికి చెందిన బాలసుబ్రమణియన్ పలు గ్రంథాల సంపాదకుడిగా వ్యవహరించారు. వీరికి ఈ నెల 16వ తేది స్థానిక అన్నాసాలైలో ఉన్న రాణి సీథై అరంగంలో జరగనున్న కార్యక్రమంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి మహాదేవన్ పురస్కారాలు అందజేయనున్నారు.

షాపర్స్ స్టాప్ పునఃప్రారంభం



ప్రారంభోత్సవంలో ఐశ్వర్య రాజేష్, కవీంద్ర

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెట్‌పేట్, హ్యారింగ్టన్ రోడ్డులో ఉన్న 'షాపర్స్ స్టాప్' ఆధునీకరించిన షాపింగ్ మాల్ పునఃప్రారంభమైంది. అత్యాధునిక హంగులు, మరిన్ని సోయగాలతో రూపొందిన ఈ మాల్‌ను ప్రముఖ సినీ నటి ఐశ్వర్య రాజేష్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపర్స్ స్టాప్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో కవీంద్ర మిశ్రా మాట్లాడుతూ... షాపర్స్ స్టాప్ కొత్త ఎలివేటెడ్ లుక్, షాపింగ్ అనుభవం కలిగిస్తుందని, అనేక కొత్త బ్రాండ్‌లు అందుబాటులో ఉంచామన్నారు. ఈ స్టోర్‌లో 500కు పైగా బ్రాండ్‌లు, లేటెస్ట్ ట్రెండీ ఫ్యాషన్, ఎలివేటెడ్ బ్యూటీ ఎక్స్‌పీరియన్స్, విస్తృత శ్రేణి గడియారాలు, బ్యాగులు, సన్ గ్లాసెస్, పెర్ఫ్యూమ్స్ వంటివి ఈ మాల్‌లోకి అడుగుపెట్టాయన్నారు. ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ... షాపర్స్ స్టాప్ ఐకానిక్ బ్రాండ్ అని, ఇది అద్భుతమైన బ్రాండ్లు, అధునాతన శైలిని కలిగి ఉందన్నారు. ఇందులో తాను భాగమైనందుకు ఆనందంగా ఉందన్నారు. షాపర్స్ స్టాప్ ప్రత్యేకమైన ఆఫర్లతో కొనుగోలుదార్లకు ఆనందాన్ని జోడిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళలకు ముగ్గుల పోటీ



ప్రథమ విజేత రమ్య

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని ఉత్తర మద్రాస్ ఉగాది మహోత్సవ కార్యనిర్వాహక వర్గం, సర్ త్యాగరాయ కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పాతచాకలిపేటలో ఉన్న చాముండేశ్వరి ఆలయంలో ముగ్గుల పోటీలు జరిగాయి. వుమ్మిటి గజలక్ష్మి, దేవన ఈశ్వరీ దేవి, గోసు ఉషారాణి, నాప వరలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఇందులో విజేతగా రమ్య, రెండో స్థానంలో తనూజ, తృతీయ స్థానంలో హేమలత, నళిని నిలిచారు. విజేతలకు ఈ నెల 14న ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్టు జక్కుల హరికృష్ణ, సూరతి బలరాం, వుమ్మిటి శ్రీనివాసులు, దేవి మాధవయ్య పేర్కొన్నారు.

డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో 'రెటికాన్ 2024' పేరుతో అంతర్జాతీయ సదస్సు జరిగింది. దేశంలోనే అతిపెద్ద వార్షిక రెటీనా సదస్సుల్లో ఒకటైన ఈ కార్యక్రమంలో దేశవిదేశాల నుంచి 1500 మందికి పైగా నేత్ర వైద్యులు, విట్రొరెటినల్ నిపుణులు పాల్గొన్నారు. రిపబ్లిక్ ఆఫ్ మారిషస్ రాయబారి మలైయప్పన్ నాగలింగం సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్యా పరిశోధన, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.సంగుమణి, డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి విట్రియోరెటినాల్ సర్జన్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ డాక్టర్ అసర్ అగర్వాల్ సదస్సును లాంఛనంగా ప్రారంభించారు.ఢిల్లీలోని సెంటర్ ఫర్ సైట్‌లోని విట్రియో-రెటినా సర్వీసెస్ డైరెక్టర్, ఆలిండియా ఆప్తాల్మాలాజికల్ సొసైటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ లలిత్ వర్మ కీలకోపన్యాసం చేశారు.

బావిలో పడి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

● జన్మదినం రోజున విషాదం

వేళచ్చేరి, ఏప్రిల్ 7: వ్యవసాయ బావిలో పడి ఇంజనీరింగ్ విద్యార్థి మృతిచెందాడు. విరుదునగర్ జిల్లా అరుప్పుకోటకు చెందిన శక్తి ప్రకాష్ (21) తిరుచ్చి కేర్ కళాశాలలో మూడో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులతో కలసి పూంగుడి గ్రామ శివార్లలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అక్కడ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్న అనంతరం అందరూ బావిలో మునిగేందుకు దిగారు. ఊహించని విధంగా శక్తి ప్రకాష్ నీటమునిగాడు. సమాచారం అందుకున్న శ్రీరంగం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని పంపుల ద్వారా బావిలోని నీరు తొలగించి మృతదేహాన్ని వెలికితీసి తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై తిరుచ్చి రాంజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాడిపశువులకు ధాతు లవణ నీటిని ఇవ్వండి

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: వేసవిలో పాడిపశువులకు ఉష్ణతాపం వల్ల కలిగే నీరసం తగ్గించేలా ధాతు లవణం కలిపిన నీటిని ఇవ్వాలని రాష్ట్ర పాల ఉత్పత్తిదారుల సహకార శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయని, ఎండ తీవ్రత నుంచి పశువులు సేదతీరేలా వసతులు కల్పించాలన్నారు. అలాగే, పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గకుండా పశువులకు ధాతు లవణాలు కలిపిన నీటిని దాణాతో పాటు అందజేయాలని సూచించారు.

ఆవడి టాస్మాక్ బార్ సీజ్

● పొరుగు రాష్ట్రాల బీర్ల విక్రయం

అడయార్, ఏప్రిల్ 7: ఆవడిలో టాస్మాక్ అనుబంధ బార్‌ను అధికారులు సీజ్ చేశారు. ఈ బార్‌లో పొరుగు రాష్ట్రాలకు చెందిన బీరు బాటిళ్లను అధికారులు గుర్తించారు. తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పొరుగు రాష్ట్రాలకు చెందిన బీర్లు భారీ మొత్తంలో విక్రయిస్తున్నట్టు టాస్మాక్ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా మేనేజర్ సీకే సెంథిల్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది టాస్మాక్ బార్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో ఆవడి సమీపంలోని పూచ్చి అత్తిపేడులోని టాస్మాక్ బార్‌లో భారీ మొత్తంలో పొరుగు రాష్ట్రాల బీర్లను గుర్తించారు. దీంతో ఈ బార్‌ను సీజ్ చేశారు. సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

షేర్ మార్కెట్ వ్యాపారి హత్య

● ఇద్దరు నిందితుల అరెస్టు

అడయార్, ఏప్రిల్ 7: షేర్ మార్కెట్ బిజినెస్ చేస్తున్న వ్యాపారి దారుణహత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. చెంగల్పట్టు జిల్లా కేంద్రం కొత్త బస్టాండు, రాజాజీ సాలైలో శ్రీనివాసన్ (49) షేర్ మార్కెట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆయన ఇటీవల అదృశ్యమయ్యారు. ఆ తర్వాత అతని కోసం గాలించగా, చెన్నై గోపాలపురంలో ఉన్నట్టు గుర్తించారు. శ్రీనివాసన్‌ను నమ్మి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిన వారిలో గోకుల్, కార్తీక్ మరికొందరు ఉన్నారు. వీరిద్దరు శ్రీనివాసన్‌ను సంప్రదించి, డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయగా, షేర్ మార్కెట్‌లో నష్టం వచ్చిందని, సొమ్ము తిరిగి చెల్లించేందుకు కొంత సమయం కావాలని కోరారు. అయితే కార్తీక్, గోకుల్‌లు శ్రీనివాసన్‌ను కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టి హత్యచేశారు. దీనిపై సమాచారం అందుకున్న చెంగల్పట్టు పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గోకుల్, కార్తీక్‌ను అరెస్టు చేయగా, హత్యతో సంబంధం ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

వైద్య కళాశాలకు బాంబు బెదిరింపు

ఐసిఎఫ్,ఏప్రిల్7:స్థానిక తిరువేర్కాడు సమీపంలో ఉన్న వైద్యకళాశాలకు బాంబు బెదిరింపు రావడంతో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. తిరువేర్కాడు వేళప్పన్ చావిడిలో ఉన్న ప్రైవేటు వైద్యకళాశాల, ఆసుపత్రికి శనివారం సాయంత్రం ఉత్తరం వచ్చింది. రూ.కోటి అందజేయకపోతే 24 గంటల్లో కళాశాలలో బాంబు పేలుతుందని రాసి ఉంది. దీనిపై కళాశాల నిర్వాహకులు తిరువేర్కాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు అక్కడకు చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించి, బాంబు లేదని నిర్ధారించి ఊపిరి పీల్చుకున్నారు.

ఖైదీలకు గంజాయి సరఫరా : ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 7: స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో ఖైదీలకు గంజాయి సరఫరా చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మెరీనా పోలీసులు గత వారం గంజాయి అక్రమ తరలింపు కేసులో కార్తీక్ ని అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. కార్తీక్ కలుసుకొనేందుకు వెళ్లిన అతని తమ్ముడు కరన్, బంధువు కుమారిని జైలు సిబ్బంది తనిఖీ చేయగా, వారు లోదుస్తుల్లో దాచిన 30 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో జైలు సిబ్బంది ఫిర్యాదుతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

మద్యం మత్తులో పోలీసులతో వాగ్వాదం

ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 7: స్థానిక మాధవరంలో మద్యం మత్తులో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మాధవరం 200 అడుగుల రోడ్డు సమీపంలో శాస్త్రినగర్ టాస్మాక్ మద్యం బార్‌లో శనివారం పొన్నియమ్మన్‌మేడుకు చెందిన మణవానన్, శరవణన్ మద్యం తాగుతుండగా... రాత్రి 10 గంటలు దాటడంతో బార్ మూసివేయాలని తెలిపిన నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్వాహకులు పోలీస్ కంట్రోల్‌రూంకు సమాచారం అందించగా, పోలీసులు అక్కడికి చేరుకొని వారిని వెళ్లాలని తెలిపినా పట్టించుకోక పోగా వాగ్వాదానికి దిగారు. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

అర్ధరాత్రి మళ్లీ బైక్ రేస్

పెరంబూర్, ఏప్రిల్ 7: నగరంలోని ప్రధాన రోడ్లపై శనివారం యువకులు బైక్ రేస్ నిర్వహించారు. అన్నాసాలై, టీటీకే రోడ్డు, జెమిని ఫ్లైఓవర్, వళ్లువర్‌కోట్టం ప్రాంతాల్లో యువకులు బైక్ రేస్ నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వేకువజాము 2 గంటల సమయంలో పలువురు యువకులు వాహనాలకు ఎదురు వెళుతూ, అడ్డదిడ్డంగా బైక్ నడుపుతుండడంతో వాహన చోదకులు బెంబేలెత్తిపోయారు. పోలీసులు వారిని అడ్డుకొనేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అనంతరం పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి, అందులో నమోదైన బైక్ నెంబర్ల ఆధారంగా రేస్‌కు పాల్పడిన యువకుల కోసం గాలిస్తున్నారు.

ఘనంగా మదర్ మెట్రిక్ స్కూలు స్నాతకోత్సవం



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 7: స్థానిక కలవై మదర్ మెట్రిక్ ఉన్నత పాఠశాలలో ఎల్కేజీ, యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి సచ్చిదానంద స్వామి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా డార్లింగ్ సంస్థ ఎండీ వెంకట సుబ్బు, వీఎస్ రమేష్‌కుమార్, రమేష్ జ్యువెలరీ యజమాని రమేష్ జీ, టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి శ్రీ వత్సవ్, సీఏఫ్ టైమ్స్ ఆఫ్ ఇండియా మూర్తి, రియల్ ఎస్టేట్ సురేష్, కరస్పాండెంట్ సుగుణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15 నుంచి 19వ తేది వరకు పాఠశాలలకు సెలవులు

పెరంబూర్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో 4వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 15 నుంచి 19వ తేది వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 19వ తేది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సి ఉండడంతో ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అదే సమయంలో 22, 23 తేదీల్లో విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని, పరీక్షలు రాసే విద్యార్థులకు మాత్రం పాఠశాలలకు రావాలని పాఠశాల విద్యాశాఖ తెలియజేసింది.

టాస్మాక్ దుకాణాలకు మూడు రోజుల సెలవు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మద్యం దుకాణాలు మూడు రోజులు మూసివేయనున్నట్లు టాస్మాక్ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈనెల 19వ తేది ఒకే విడతలో పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ నెల 17వ తేది సాయంత్రం 6 గంటల నుంచి 19వ తేది సాయంత్రం 6 గంటల వరకు మూడు రోజులు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు టాస్మాక్ సంస్థ హెచ్చరించింది.

భార్యను కాపాడలేని వ్యక్తి ప్రజలను రక్షిస్తారా?

సీపీఐ రాష్ట్రకార్యదర్శి ముత్తరసన్ ప్రశ్న

అడయార్, ఏప్రిల్ 7: సొంత భార్యను కాపాడలేని వ్యక్తి దేశ ప్రజలను ఎలా రక్షిస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ విరుచుకుపడ్డారు. దేశ ప్రజలంతా తన కుటుంబం అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ముత్తరసన్ స్పందించారు. తిరుచ్చి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎండీఎంకే నేత దురై వైగోకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ ప్రజలు, రైతులు, విద్యార్థులు తీసుకునే రుణాలను బలవంతంగా వసూలు చేసేందుకు మోదీ అమితాసక్తి చూపుతున్నారన్నారు. కానీ, దేశంలోని కొందరు పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలను రుణాంగా తీసుకుని చెల్లించకుండా విదేశాలకు పారిపోయినా వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. పైగా, రానున్న ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయన్న నమ్మకం తనకు లేదన్న ముత్తరసన్ భారత ఎన్నికల సంఘం కేంద్రం చేతిలో కీలుబొమ్మలా మారిపోయిందని ఆరోపించారు.

కోవైలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం: సీఎం

అడయార్, ఏప్రిల్ 7: రాష్ట్రంలోని ముఖ్యమైన జిల్లా కేంద్రాల్లో ఒకటిగా ఉన్న కోయంబత్తూరులో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. ఈ స్టేడియం నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో రెండో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంగా గుర్తింపు పొందుతుందన్నారు. ఇదే విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. జిల్లాలోని ఔత్సాహికులు, క్రీడాకారులను దృష్టిలో ఉంచుకుని, అంతర్జాతీయ సౌకర్యాలతో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం తమ ప్రభుత్వం కట్టుబడివుందని మంత్రి ఉదయనిధి పేర్కొన్నారని, ఆ మేరకు తాము క్రీడా రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఈ హామీతో డీఎంకే ఇటీవల వెల్లడించిన ఎన్నికల హామీలతో పాటు ఈ క్రికెట్ స్టేడియం నిర్మాణ హామీ కూడా జాబితాలో చేరుతుందన్నారు.

అంబేడ్కర్ జయంతికి అనుమతివ్వాలి

ఐసిఎఫ్, ఏప్రిల్ 7: ఎన్నికల నిబంధనలు కారణం చూపి అంబేడ్కర్ జయంతి వేడుకలను అడ్డుకోకుండా అనుమతివ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు తమిళరసన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 14వ తేది అంబేడ్కర్ 134వ జయంతి కావడంతో ఆ రోజు ఆయన విగ్రహాలకు పూలదండలు వేసి నివాళి అర్పించనున్నారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడంతో ఈ వేడుకలు జరుపుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ తమిళరసన్ తన వినతిపత్రంలో పేర్కొన్నారు.

ముమ్మరంగా డీఎంకే ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో డీఎంకే శ్రేణులు

వేలూరు, ఏప్రిల్ 7: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఆనైకట్టు తూర్పు యూనియన్‌లో డీఎంకే శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. ఆనైకట్టు యూనియన్ సెక్రటరీ కుమరపాండ్యన్, అధ్యక్షుడు వెంకటేశన్, నేతలు సెల్వరాజ్, మురుగేశన్, జిల్లా పంచాయతి అధ్యక్షుడు బాబు పర్యవేక్షణలో ఎల్ఈడీ స్క్రీన్ వాహనం ద్వారా డివిజన్ పరిధిలోని గ్రామాల్లో 'ఉదయించే సూర్యుడు' గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రచారం చేపట్టారు.

బీజేపీకి న్యాయవాదుల సంఘం మద్దతు



వేలూరు, ఏప్రిల్ 7: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగంకు వేలూరు న్యాయవాదుల సంఘం మద్దతు తెలిపింది. కోర్టు ప్రాంగణంలో ఆదివారం న్యాయవాదుల సంఘ సమావేశం నిర్వహించి బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. ఈ మేరకు బీజేపీ కూటమి అభ్యర్థి ఏసీ షణ్ముగం, పీఎంకే జిల్లా కార్యదర్శి వెంకటేశన్, ఏఎంఎంకే జిల్లా అధ్యక్షుడు మూర్తిని సంఘ ప్రతినిధులు బాలచందర్, కృష్ణస్వామి, అశోకన్, కమల మర్యాదపూర్వకంగా కలుసుకుని మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు.

మహేష్ ఆనంద్‌కు మద్దతుగా సీమాన్ ప్రచారం



వేలూరు, ఏప్రిల్ 7: వేలూరు నియోజకవర్గ ఎన్టీకే అభ్యర్థిగా ఇంజనీర్ మహేష్ ఆనంద్ పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా ఆదివారం ఆ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ బస్టాండ్ సహా పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, 'మైక్' గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీక్రోధి సంవత్సరం పంచాంగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 7: వేలూరు బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో శ్రీ క్రోధి సంవత్సర తమిళ పంచాంగం ఆవిష్కరణ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆడిటర్ గాయత్రి దేవి పాల్గొని పంచాంగం ఆవిష్కరించి సంఘ అధ్యక్షుడు రాజాకు తొలిప్రతి అందించారు. కార్యక్రమంలో అడ్వైజర్లు సత్యమూర్తి, మీనాక్షి సుందరం, రాష్ట్ర ఉప కార్యదర్శి కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ జయకుమార్, కోశాధికారి రాజగోపాల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకేకు మక్కల్ మేంబాట్టు కళగం మద్దతు



సుబ్రమణి

వేలూరు, ఏప్రిల్ 7: వేలూరు లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేకు మక్కల్ మేంబాట్టు కళగం మద్దతు తెలిపింది. ఈ కళగం సమావేశం కరుగమ్‌బత్తూర్ కాట్టుపదూర్‌లో ఆదివారం జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతు తెలపడంతో పాటు వీధి ప్రచారంలో పాల్గొనాలని తీర్మానించారు. సమావేశానికి కళగం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణి అధ్యక్షత వహించగా, వేలూరు జిల్లా అధ్యక్షుడు మురుగేశన్, మహిళా శాఖ అధ్యక్షురాలు శాంత, తిరువణ్ణామలై జిల్లా అధ్యక్షుడు చంద్రన్, వేలూరు నియోజకవర్గ అధ్యక్షుడు హరికృష్ణన్, కాట్పాడి అధ్యక్షుడు మునివేలు, వేలూరు జిల్లా మహిళా శాఖ అధ్యక్షురాలు బేబి, సభ్యులు పాల్గొన్నారు.

కోరమాండల్ కర్మాగార విస్తరణకు అనుమతిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు

ప్యారీస్, ఏప్రిల్ 7: స్థానిక ఎన్నూర్ కోరమాండల్ కర్మాగార విస్తరణకు అనుమతులు జారీ చేసిన రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా దాఖలైన కేసులో ప్రభుత్వం, కర్మాగారం యజమాన్యాన్ని వివరణ కోరుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నూర్ సమీపంలో ఉన్న పెరియకుప్పంలో కోరమాండల్ ఎరువుల తయారీ ఫ్యాక్టరీ ఉంది. సముద్రంలో నిలిపి ఉన్న నౌక నుంచి పైపు ద్వారా ఆ కర్మాగారానికి అమ్మోనియా వాయువు సరఫరా అవుతోంది. గత డిసెంబరు 26వ తేది అర్ధరాత్రి హఠాత్తుగా అమ్మోనియా వాయువు లీకై పరిసర ప్రాంతాల్లో ఉన్న పెరియకుప్పం, చిన్నకుప్పం వాసులు ఊపిరాడక పడరాని పాట్లు పడ్డారు. సుమారు 30 మందికిపైగా బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం కోలుకున్నారు. ఈ సంఘటన అనంతరం కోరమాండల్ కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, ఈ కర్మాగారం విస్తరణకు కోస్టల్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనలు అతిక్రమించి తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ ఎన్నూర్ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు దాఖలైంది. ఈ ట్రిబ్యునల్ న్యాయశాఖ సభ్యుడు జస్టిస్ పుష్పా సత్యనారాయణ, టెక్నికల్ సభ్యుడు కె.సత్యగోపాల్ సమక్షంలో గురువారం విచారణకు రాగా, ఇరుతరపు న్యాయవాదులు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వం, కర్మాగార యజమాన్యానికి నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ మే 7వ తేదీకి వాయిదా వేసింది.

ఐదో రోజు కొనసాగిన చిరుత గాలింపు

మైలాడుదురైలో 5వ రోజుగా చిరుతపులి బంధించే చర్యలను అటవీ శాఖ సిబ్బంది చేపట్టారు. ఈ ప్రాంతంలో జనావాసాల్లో సంచరిస్తున్న చిరుత మేకలను హతమారుస్తోంది. దాన్ని బంధించేందుకు 10 ప్రాంతాల్లో బోన్లు, సీసీ కెమెరాలు, డ్రోన్లు, 8 పోలీసు జాగిలాలతో అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు. ఆదివారం సీసీ కెమెరాలోని మెమరీ కార్డు తీసుకెళ్లిన అధికారులు, చిరుత ఏ ప్రాంతంలో సంచరించిందో పరిశీలిస్తున్నారు.

● ప్రచారంలో పదనిసలు



తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే కూటమి తరపున పోటీ చేస్తున్న ఎండీఎంకే అభ్యర్థి దురై వైగోకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్



సెంట్రల్ చెన్నై నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్



కన్నియకుమారి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి విజయ్ వసంత్ చేపల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న దృశ్యం



రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గం లో డీఎంకే కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థి ఘని కె.నవాజ్‌కు మద్దతుగా బైక్ ర్యాలీలో పాల్గొన్న టీఎన్‌సీసీ చీఫ్ సెల్వ పెరుందగై



కరూర్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతి మణి ఆదివారం ప్రచారంలో భాగంగా మహిళలతో ముచ్చటిస్తున్న దృశ్యం



పెరంబలూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరపున పోటీస్తున్న ఐజేకే వ్యవస్థాపకుడు పారివేందర్ ఓట్లు అభ్యర్థిస్తున్న దృశ్యం



ప్రచారంలో భాగంగా చిన్నారిని పలకరిస్తున్న నీలగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్



దిండుగల్ లోక్‌సభ నియోజకవర్గంలో పీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిలకభామ ఓ దుకాణంలో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం



ఉత్తర చెన్నై నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి డాక్టర్ జయవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టిన మాజీ మంత్రి గోకుల ఇందిర పకోడీలు కాలుస్తున్న దృశ్యం

● తిరుప్పూర్ నియోజకవర్గం

డాలర్ సిటీ ఎవరికి దక్కేనో?

● తిరుప్పూర్‌లో సీపీఐ, అన్నాడీఎంకే పోటాపోటీ



కె.సుబ్బరాయన్ (సీపీఐ)- అరుణాచలం (అన్నాడీఎంకే) - ఏపీ మురుగానందం (బీజేపీ)

పెరంబూర్, ఏప్రిల్ 7: రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల వరుసలో 18వ స్థానంలో తిరుప్పూర్ లోక్‌సభ నియోజవర్గం ఉంది. 2009 ముందు వరకు తిరుప్పూర్ లోక్‌సభ స్థానం లేదు. నియోజకవర్గ పునర్విభజన అనంతరం గోపిచెట్టిపాళయం నియోజకవర్గానికి బదులుగా తిరుప్పూర్ ఆవిర్భవించింది. ఈ నియోజకవర్గంలో తిరుప్పూర్ జిల్లాలోని తిరుప్పూర్ ఉత్తరం, తిరుప్పూర్ దక్షిణం, ఈరోడ్ జిల్లాలోని అందియూర్, భవాని, పెరుందురై, గోపిచెట్టిపాళయం తదితర ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పెరుందురై, భవాని, గోపిశెట్టిపాళయం, తిరుప్పూర్ ఉత్తరం నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే, అందియూర్, తిరుప్పూర్ దక్షిణంలో డీఎంకే విజయం సాధించాయి.

తొలి ఎంపీ శివసామి...

2009లో తిరుప్పూర్ జిల్లా ఆవిర్భవించింది. అదే ఏడాది తిరుప్పూర్ లోక్‌సభ నియోజకవర్గం కూడా ఏర్పాటైంది. 2009లో జరిగిన తొలి ఎన్నికల్లో విజయం సాధించిన ఘనత అన్నాడీఎంకే తరఫున పోటీ చేసిన శివసామి నిలిచారు. అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థి సత్యభామ విజయం సాధించారు. ఇక, 2019లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫున పోటీ చేసి సీపీఐ అభ్యర్థి కె.సుబ్బరాయన్ గెలుపొందారు. ఈ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ప్రస్తుతం 4వ సారి ఎన్నికలు జరుగుతున్నాయి.

2019 ఎన్నికల ఫలితాలు...

2019 లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి కె.సుబ్బరాయన్ 5,08,725 ఓట్లు సాధించి విజయం సాధించారు. అలాగే, అన్నాడీఎంకే అభ్యర్థి ఎంఎస్‌ఎం ఆనందన్ 4,15,357 ఓట్లతో సాధించి ద్వితీయ స్థానంలో, మక్కల్ నీది మయ్యం అభ్యర్థి చంద్రకుమార్ 64,657 ఓట్లు, ఏఎంఎంకే అభ్యర్థి సెల్వం 43,816 ఓట్లు, ఎన్టీకే అభ్యర్థి జగన్నాథన్ 42,189 ఓట్లు సాధించారు.

సామాజిక వర్గాలు..

ఈ నియోజకవర్గ పరిధిలో కొంగు వేలాలర్ గౌండర్లు అధికంగా ఉన్నారు. వారి తర్వాత మొదలియార్, వెట్టువ గౌండర్లున్నారు. అలాగే, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆదిద్రావిడులు కూడా గణనీయంగా ఉన్నారు. భవాని, అందియూర్ నియోజకవర్గాల్లో వన్నియర్లు అధికంగా ఉన్నారు. అందియూర్ బర్గూర్ కొండ ప్రాంతాల్లో లింగాయత్ వర్గం ఉన్నారు. ఇక, నాయకర్లు కూడా ఉన్నారు. పెరుందురై, గోపిచెట్టిపాళయం నియోజకవర్గాల్లో నాడార్లు అధిక సంఖ్యలో ఉన్నారు. అలాగే, ఆరు నియోజకవర్గాల్లో మైనార్టీలు కూడా చెప్పుకోదగిన ఓటు శాతం కలిగి ఉన్నారు. తిరుప్పూర్ ఉత్తరం, తిరుప్పూర్ దక్షిణంలో దుస్తుల తయారీ పరిశ్రమలు అధికంగా ఉండగా, ఉపాధి కోసం వచ్చిన ఉత్తరాదివాసులు అధిక సంఖ్యలో ఉన్నారు.

దుస్తుల పరిశ్రమ...

మొత్తం ఓటర్లు	: 15,98,443
పురుషులు	: 7,86,475
మహిళలు	: 8,11,718
ఇతరులు	: 250

తిరుప్పూర్ ఉత్తరం, తిరుప్పూర్ దక్షిణం అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో దుస్తుల తయారీ పరిశ్రమలున్నాయి. ఇక్కడ తయారయ్యే దుస్తులు విదేశీలకు ఎగుమతి అవుతున్న నేపథ్యంలో 'డాలర్ సిటీ'గా పేరుపొందింది. యేటా కోట్ల రూపాయల పన్నులు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెల్లిస్తున్న జిల్లాగా తిరుప్పూర్ పేరు గాంచింది. జీఎస్‌టీ, దుస్తుల తయారీ ముడిసరుకుల ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల పెంపు తదితరాలతో ఈ పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. కార్పొరేషన్ ట్రాఫిక్ సమస్యల నియంత్రించేలా ఫ్లై ఓవర్లు, కోయంబత్తూర్ మెట్రోరైలు పథకాన్ని తిరుప్పూర్ వరకు పొడిగించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయం...

దుస్తుల పరిశ్రమ తర్వాత వ్యవసాయం ఉంది. జిల్లాలోని గోపిచెట్టిపాళయం ప్రాంతంలో రైతులు అధికంగా కొబ్బరి సాగు చేపట్టారు. కల్లు గీసేందుకు అనుమతి, కొబ్బరి నూనె రేషన్ దుకాణాల్లో విక్రయించాలని రైతులు కోరుతున్నారు. ఇక, అందియూర్ కొండ ప్రాంతాన్ని ఏనుగుల శరణాలయంగా ప్రకటించడంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజనులు కొండ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేపట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.

సీపీఐ - అన్నాడీఎంకే మధ్యే పోటీ...

ప్రస్తుత ఎన్నికల్లో డీఎంకే కూటమి తరపున సీపీఐ సిట్టింగ్ ఎంపీ కె.సుబ్బరాయన్ మళ్లీ బరిలో నిలిచారు. గత ఎంపీగా నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులైన ఆయన విజయానికి కూటమి పార్టీలు కూడా కృషి చేస్తుండడం కలిసొచ్చే అంశం. అలాగే, ఆయన తిరుప్పూర్ జిల్లాకు చెందిన వారు. అలాగే, అన్నాడీఎంకే తరపున అరుణాచలం పోటీ చేస్తున్నారు. ఆయన ఈరోడ్ కార్పొరేషన్ తూర్పు జిల్లా ఎంజీఆర్ యువజన విభాగం కార్యదర్శిగా, పెరుందురై మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్. ఈ నియోజకవర్గంలోని నాలుగు అసెంబ్లీ స్థానాలు ఈరోడ్ జిల్లాలో ఉండడం, అరుణాచలం ఈరోడ్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో, ఈ నాలుగు నియోజకవర్గాల్లో మెజార్టీ ఓట్లు ఆయన సాధించే అవకాశముంది. అలాగే, గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో మంత్రులుగా పని చేసిన జిల్లాకు చెందిన సెంగోట్టయన్, కరుప్పన్.. అరుణాచలం విజయం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఇక, బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఏపీ మురుగానందం కోయంబత్తూర్‌వాసి. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. యువతలో బీజేపీకి ఉన్న క్రేజ్ తనకు విజయాన్ని అందిస్తుందని విశ్వసిస్తున్నారు. అలాగే, ఎన్టీకే తరపున ఈరోడ్ జిల్లావాసి సీతాలక్ష్మి పోటీ చేస్తున్నారు. లెక్చరర్‌గా ఉన్న ఆమె తర్వాత పార్టీలో చేరారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో భవాని నియోజకవర్గంలో, ఈరోడ్ పార్లమెంటు నియోజకవర్గంలో ఆమె పోటీ చేశారు.



● ప్రచార హోరు

టి.నగర్‌లో కరుణానిధి విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కరుణానిధి

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ చెన్నై నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగ పాండ్యన్‌కు మద్దతుగా టి.నగర్ ఎమ్మెల్యే జె.కరుణానిధి విస్తృత ప్రచారం చేస్తున్నారు. శనివారం రాత్రి 141వ డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇప్పటి వరకూ తమ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తులో తాము చేయతలపెట్టిన పనుల గురించి ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఆయన వెంట కౌన్సిలర్లు కె.ఏళుమలై, జె.రాజా అన్బళగన్, పార్టీ కార్యదర్శి ఎస్.లక్ష్మీకాంతన్, సభ్యుడు పీజే ప్రవీణ్ తదితరులున్నారు.

పేదరికాన్ని నిర్మూలిస్తా

● బీజేపీ నేత వినోజ్ పి.సెల్వం



చేపల మార్కెట్‌లో వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వినోజ్ పి.సెల్వం

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానని సెంట్రల్ చెన్నై లోక్‌సభ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం హామీనిచ్చారు. ఆదివారం ఆయన నాతుముత్తు వీధి, పిళ్లయార్ కోయిల్‌వీధి, ఇళంగోరోడ్, పోప్స్ రోడ్ మెయిన్, వెంకటరత్నం వీధి, రాజా కృష్ణరోడ్, నల్లన్ వీధి, వరదరాజపురం, ఎంఎం గార్డెన్, వీనస్ కాలని, మహారాజా చిన్నమ్మాళ్‌రోడ్, భాష్యం వీధి, అంబుజం వీధి, సీమాన్ శ్రీనివాసన్ వీధి, టీటీకే రోడ్డు, పార్థసారథి తోట, కస్తూరి రంగన్ వీధి, డాక్టర్ రాధాకృష్ణన్ రోడ్డు, చొక్కలింగం వీధి, ముత్తయ్య వీధి, అవ్వై షణ్ముగం రోడ్డు, అయ్యప్పన్ వీధి, పొన్నుస్వామి వీధి తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేశారు. మార్గమధ్యంలో కూరగాయల మార్కెట్, చేపల్ మార్కెట్లకు కూడా వెళ్లి అక్కడ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వినోజ్ మాట్లాడుతూ... దేశంలో పేదరికమే ప్రధాన సమస్య అని, పేదరిక నిర్మూలన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని కొనియాడారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన సెంట్రల్ చెన్నై డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్.. ఆ తరువాత మనుమరుగై పోయారని, మళ్లీ ఇప్పుడు ఓట్ల కోసం ప్రజల్లోకి వచ్చారని దుయ్యబట్టారు. తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని వినోజ్ హామీనిచ్చారు.

● పండుకు టైమొచ్చింది

పనస పండ్లకు గిరాకీ



పెరంబూర్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో పనస పండ్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. అందుకు కారణమైన లోక్‌సభ ఎన్నికలకు పనస పండ్ల రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ విషయాన్ని ఒక్కసారి పరిశీలిస్తే... ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అంగీకారం పొందిన పార్టీలకు గుర్తులు కేటాయిస్తుండగా, స్వతంత్ర అభ్యర్థులకు పెన్, నిచ్చెన సహా పలు చిహ్నాలు కేటాయిస్తున్నారు. అలాగే, కొందరికి పనస పండు గుర్తు కేటాయించారు. రామనాథపురం నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, వేలూరు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నటుడు మన్సూర్ అలీఖాన్ సహా పలువురికి పనస పండు చిహ్నాన్ని కేటాయించారు. దీంతో, ప్రచారానికి ఇంకా 10 రోజులే ఉన్న నేపథ్యంలో, పనస పండు గుర్తు ప్రజల్లోకి వెళ్లేలా స్వతంత్ర అభ్యర్థులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా తమ ప్రచారంలో అధికంగా పనస పండ్లు కనిపించేలా వాటిని కొనుగోలు చేసి కార్యకర్తలకు అందిస్తున్నారు. కాకపోతే పనస పండును ఉదయం నుంచి రాత్రి వరకు మోయలేక ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు తిట్టుకుంటున్నారు.

● నగరవాసులుగా మరి!

ఓటు వేసేందుకు చెన్నైవాసుల అయిష్టత



పెరంబూర్, ఏప్రిల్ 7: రాజధాని నగరం చెన్నైవాసులు ఓటు వేసేందుకు సుముఖత చూపడం లేదు. ఈ మాట సాక్షాత్తు చెన్నై జిల్లా ఎన్నికల కమిషనర్ జె.రాధాకృష్ణన్ తెలిపారు. నందనంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరిగిన అధికారుల శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... చెన్నై జిల్లా పరిధిలో ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, మధ్య చెన్నై లోక్‌సభ నియోజకవర్గాల్లో సరాసరిన 100కు 60 మంది మాత్రమే ఓటు వేస్తున్నారన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర చెన్నై, మధ్య చెన్నై లోక్‌సభ నియోజకవర్గాల్లో 58 శాతం, ఉత్తర చెన్నైలో 64 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. దేశ, రాష్ట్రస్థాయిలో పరిశీలిస్తే చెన్నైలో ఓటింగ్ నమోదు తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు శాతం పెంచేలా నగరంలోని 588 అపార్ట్‌మెంట్లు, 228 గుడిసె ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామని రాధాకృష్ణన్ చెప్పుకొచ్చారు.

● ప్రచారంలో మనోళ్లు

తమిళిసై సౌందర్‌రాజన్‌ను గెలిపించండి

● బీజేపీ నేత కాపు రామచంద్రా రెడ్డి పిలుపు



తమిళిసైకి మద్దతు తెలుపుతున్న కాపు

అడయార్, ఏప్రిల్ 7: ఎన్డీయే కూటమిలోని భారతీయ జనతా పార్టీ తరఫున సౌత్ చెన్నై లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీజేపీ నేత కాపు రామచంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. ఇదే విషయంపై ఆయన చెన్నై ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.... ప్రపంచ దేశాల్లో భారత్‌ను శక్తిమంతమైన దేశంగా తీర్చిదిద్దిన ప్రధాని నరేంద్ర మోదీని మరోమారు ప్రధానమంత్రిని చేసేందుకు, కేంద్రంలో ఎన్డీయే కూటమిని అధికారంలోకి తెచ్చేందుకు ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ముఖ్యంగా తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ స్థానాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులకు కమలం, మామిడిపండు, సైకిల్, పనసపండు, కుక్కర్ చిహ్నాలపై ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, సౌత్ చెన్నై స్థానం నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

● అయ్యో... అయ్యయ్యో!

'ఇండియా కూటమి'కి ఓటేయండి

● దినకరన్ ప్రచార సభలో నోరు జారిన సీనియర్ నటి సీఆర్ సరస్వతి



ప్రచారంలో సీఆర్ సరస్వతి

పెరంబూర్, ఏప్రిల్ 7: ఎన్‌డీఏ కూటమిలో పోటీ చేస్తున్న ఏఎంఎంకే తిరుచ్చి అభ్యర్థి సెంథిల్ నాథన్‌కు మద్దతుగా సీనియర్ నటి సీఆర్ సరస్వతి చేసిన ప్రచారం... ఆ కూటమి నేతలు నోరెళ్లబెట్టాల్సివచ్చింది. ఆమె మాటల నుంచి కోలుకునేందుకు వారికి రెండు నిమిషాలు పట్టింది. శనివారం సాయంత్రం తిరుచ్చి నియోజకవర్గంలో ప్రచారం చేపడుతూ... వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని, దేశం బాగుపడాలంటే ఆ కూటమికి విజయం కట్టబెట్టాలని పిలుపునిచ్చారు. దీంతో ఖంగుతిన్న నేతలు ఒక్కసారిగా ఆమె మైకును ఆపేశారు. తమది ఎన్‌డీఏ కూటమి అని, ఇండియా కూటమి కాదని చెవిలో ఊదారు. దాంతో గొంతు సరి చేసుకున్న సరస్వతి.. ఆ తరువాత వారు చెప్పినట్లు చిలుక పలుకులు పలికారు.

● ఏం కష్టమొచ్చిందో?

నేను ప్రచారం చేయలేను

● జాతీయ మహిళా కమిటీ సభ్యురాలు ఖుష్బూ



పెరంబూర్, ఏప్రిల్ 7: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొనడం లేదని జాతీయ మహిళా కమిటీ సభ్యురాలు, నటి ఖుష్బూ తెలిపారు. ఈ మేరకు ఆమె పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు రాసిన లేఖలో... "గత 2019లో ఢిల్లీలో జరిగిన ప్రమాదంలో నా కాలు ఎముక విరిగి, ఆ గాయంతో ఐదేళ్లుగా కష్టపడుతున్నా. ఇప్పుడు కూడా చికిత్సలు కొనసాగిస్తున్నా. ప్రచారానికి వెళ్లొద్దని వైద్యులు సూచించినా, నా చేతనైనంత వరకు పాల్గొన్నా. కానీ, ప్రస్తుతం ఎక్కువ సేపు నిల్చోవడం, కూర్చోవడంలో ఇబ్బంది పడుతున్నా. అందువల్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోతున్నా. కానీ, సోషల్ మీడియా ద్వారా బీజేపీ అమలు చేసిన పథకాలు, సిద్ధాంతాలు, అజెండాను ప్రజలకు తెలియజేస్తా. మన ప్రధాని వరుసగా మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టడం కోసం ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు. కాగా, సోమవారం ముంబై వెళ్లనున్న ఖుష్బూ, అక్కడి వైద్యుల సూచనల మేరకు చికిత్స కోసం లండన్ వెళ్లే అవకాశమున్నట్లు సమాచారం.

చిత్రజ్యోతి

11న 'వల్లవన్ వగుత్తదడా' విడుదల



విలేకరుల సమావేశంలో చిత్ర బృందం

ఫోకస్ స్టూడియో పతాకంపై వినాయక్ దురై స్వీయ నిర్మాణ దర్శకత్వంలో హైపర్ లింక్ స్ర్కీన్ ప్లేలో క్రైం డ్రామాగా తెరకెక్కిన 'వల్లవన్ వగుత్తదడా' సినిమా ఈనెల 11న విడుదల కానుంది. దీన్ని పురస్కరించుకుని ఈ చిత్ర బృందం తాజాగా నగరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు వినాయక్ దురై మాట్లాడుతూ... 'మా రెండేళ్ల పోరాటమే ఈ సినిమా. ఈ సినిమా నిర్మాణానికి సహకరించిన నిర్మాత ధనుంజయన్‌కు కృతజ్ఞతలు. డబ్బు ఐదుగురి వ్యక్తుల జీవితాలను ఏ విధంగా మారుస్తుందన్నదే ఈ చిత్ర సారాంశం. ఇందులో నటించిన రాజేష్ ఎల్లవేళలా నాకు అండగా ఉండే వ్యక్తి. స్వాతి బాగా నటించారు. మీడియా ఆదరించాలి' అని అన్నారు. నటి స్వాతి మాట్లాడుతూ... 'యాక్టింగ్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసే సమయంలోనే నటించాలన్న కోరిక కలిగింది. కానీ, అది సాధ్యపడలేదు. చిన్న చిన్న ఫొటో షూట్‌లు, మోడలింగ్ చేసుకుంటున్నాను. తొలి చిత్రంలోనే నాకు ప్రధాన పాత్రను పోషించే అవకాశం లభించడం ఎంతో అదృష్టం' అని అన్నారు. ఈ సినిమాలో తేజ్ చరణ్‌రాజ్ హీరోగా నటించగా, రాజేష్, బాలచంద్రన్, అనన్య మణి, స్వాతి మీనాక్షి, విక్రమ్ ఆదిత్య, రెజీనారోజ్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. కార్తీక్ నల్లముత్తు ఛాయాగ్రహణం అందించగా, సక్తిణ జేవియర్ సంగీతం సమకూర్చారు.

వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నటుడు పార్తిబన్



బాల నటీనటులతో పార్తిబన్

తమిళ చిత్రపరిశ్రమలో వైవిధ్యభరితమైన చిత్రాలను తెరకెక్కించడంలో దర్శక నిర్మాత, నటుడు పార్తిబన్ ఒకరు. గతంలో ఆయన ఒకే ఒక నటుడుతో 'ఒత్త చెరుప్పు' చిత్రాన్ని తెరకెక్కించారు. ఆ తర్వాత 'ఇరవిన్ నిళల్' పేరుతో నాన్ లీనియర్ పేరుతో సింగిల్ షాట్ మూవీని రూపొందించారు. ఈ రెండు చిత్రాలను ప్రతి ఒక్కరి నుంచి ప్రశంసలతో అవార్డులు సైతం అందుకుంది. ఇపుడు 13 మంది టీనేజ్ పిల్లలతో కలిసి తెరకెక్కించిన చిత్రం 'టీన్స్'. ఇమ్మాన్ సంగీతం సమకూర్చారు. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ లాంచ్ వేడుక శనివారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ ప్రముఖులు భాగ్యరాజ్, కేఎస్ రవికుమార్, పేరరసు, చరణ్, విరుమాండి, వనితా విజయకుమార్, రోబో శంకర్, యోగిబాబు, పుగళ్ తదితరులు హాజరయ్యారు. ఇందులో నటుడు భాగ్యరాజ్ మాట్లాడుతూ... 'నాకు మంచి అసిస్టెంట్ దర్శకులు లభించారు. అందుకే నేను భాగ్యరాజ్ అయ్యాను. పార్తిబన్ విభిన్నమైన ఆలోచనా ధోరణి నాకు బాగా నచ్చుతుంది. నా వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే సమయంలోనే ఏదో కొత్తగా చేయాలని అనుకునేవారు. ఇపుడు ఆ విధంగానే వైవిధ్యభరితమైన చిత్రాలను నిర్మిస్తున్నారు' అని అన్నారు. దర్శకుడు కే.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ... కొత్తదనానికి పార్తిబన్ చిరునామాగా మారారు. ఇమ్మాన్ బాల్యం నుంచే సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడిగా అవతరించడానికి కారణం ఆయన కృషి' అన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ... 'పార్తిబన్ అనుకునివుంటే కమర్షియల్ యాక్షన్ హీరోగా మారివుండొచ్చు. కానీ, సరికొత్త కథాంశాలను ఎన్నుకుంటూ వైవిధ్యభరితంగా సినిమాలను తెరకెక్కించడంలో ఆయనకు అమితమైన ఆసక్తి ఉంది. ఈ సినిమా కూడా ఘన విజయం సాధిస్తుంది. హిట్ చిత్రాల కంటే ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించి, ప్రతినోటా చర్చించుకునే చిత్రాలను నిర్మించడం గొప్ప విషయం' అన్నారు. ఆర్.పార్తిబన్ ప్రధాన పాత్రను పోషించిన ఈ చిత్రంలో యోగిబాబు సహా మరికొందరు ప్రధాన తారాగణం నటించారు. శ్రేయా ఘోషల్, శ్రుతిహాసన్, నిత్యశ్రీ, తిరుకురల్ అరివు నేపథ్యగానం చేయగా, డి.ఇమ్మాన్ సంగీతం అందించారు.